ఈవారం కథ

# యంత్రజాలం

-నవులూరి వెంకటేశ్వరరావు

భోం చేసి, ఒంటిగంటప్పుడు, అదేదో వెన్నెల విహారంలా ఒక షిప్పింగ్ కంపెనీ వైపు నడుస్తున్నాం. కాలక్షేపానికి, తిన్నది అరగటానికి, నోటి దురదలు తీర్చుకోటానికి ఆ నడక.

ఎక్కడ చూసినా విదేశాల నించి దిగుమతి అయి, నౌకల నించి దిగి కుప్పలుగా పోసిన కోకింగ్ కోల్, రాక్ ఫాస్ఫేటు. వీచే గాలితో పైకి లేచి ధూళిగా అంతా అల్లుముకుంటో న్నాయా పదార్థాలు. చుట్టుపక్కల గుంపులు గుంపులుగా ఒకరిలో ఒకరు ఒదిగిపోతున్నట్లు నిలబడి మాట్లాడుకుంటున్న మనుషులను ఆప్యాయంగా సోకుతోంది ఆ ధూళి. మనుషులు కూడా ప్రోవులు పోసినట్లున్నారు, ఆ పదార్థాలలానే వున్నారు. కాకపోతే ఈ ప్రోవులకు ప్రాణం, ఆకలి కడుపులూ వున్నాయి.

మాలో కొందరికి పీకలదాకా తినివున్నా ఆకలి తీరినట్లు లేదు. శనక్కాయలు చూడంగానే అసంకల్పితంగా ఆగిపోయి వాళ్ళు కొంటుంటే, వాళ్ళ వెనకనే నిలబడిపోయాను హ్యామ్లెట్ నయ్యి. కొనడమా? మానడమా?

"రెండ్రూపాయలు చెనిక్కాయలు" అన్నాడా కుర్రాడు నన్నుద్దేశించి. బండి దగ్గిర నిలబడి వుండడం వల్ల ఆ బండి తాలూకా అని పొరబాటుపడి. నేను చదువుకున్నవాడిని. నాగరీకుడు, చదువుకున్నవాడు వేసుకునే దుస్తులే వేసుకుని, బండివాడికన్నా హుందాగానే వున్నా. వాడి చేతిలోనించి అయిదు రూపాయిల కాగితం తీసుకుని బండివాడికిచ్చి, రెండు రూపాయిలు తీసుకుని మూడు రూపాయిలు శనక్కాయలు ఇవ్వమని పురమాయించా.

వాడికి పద్నాలుగు, పదిహేనేళ్లుంటాయి. దేశంలో బాల్యం లేనివాళ్ళలో వాడూ ఒకడు.

"నువ్వూ అండమాను వెళుతున్నావా?" అడిగాను యథాలాపంగా.

"ఎల్లాలనే వచ్చినాను."

"ఏ వూరు మనది?"

"పలాసా దగ్గిర"


"ఒక్కడివే వచ్చావా?"

"మా ఊళ్ళో వాళ్ళతో కలిసొచ్చా."

"నేబరు" పని చేస్తాడట అండమానెళ్ళి. ఇది రెండోసారెళ్ళటం, "కానెల్లటం అవుతాదో అవదో". టిక్కెట్టు దొరకలేదు. అది బ్రతుకుతెరువుకే టిక్కెట్టు. ఊళ్ళో చెయ్యటానికి పని లేదు. అపుడొకసారి ఇపుడొకసారి దొరికే పని ఎవుడూ వుండే ఆకలి మంటను ఆర్పలేదు. పద్నాలుగేళ్ళ పసి వెధవ వందలాది మైళ్ళ దూరం దాటి - ఆడుకోవలసిన సమయాన - బ్రతుకుపోరాటంలో పాల్గొనరావటం వెనక ఒకే కథ వుంటుంది. దాన్ని తిరిగి చెప్పకోవటం అవసరమా?

వెళ్ళాలని ఇక్కడ చేరి, దానికవసరమయిన టిక్కెట్టు గురించి వీడేగాక చాలామంది దౌర్భాగ్యులు యాతన పడటం గమనించా. బంకు టిక్కెట్టు రూ. 192. క్యాబిన్‌లో పయనించాలంటే రూ. 800. బంకు టిక్కెట్లు అయిపొయ్యాయుట. వందల మంది వరుస కట్టారు అర్ధరాత్రినించి. రెండు గంటలపాటు అతికొద్దిమందికిచ్చి అయిపొయ్యాయన్నారు ఏజెంట్లు. ఆ కంపెనీ చుట్టూ ఆశగా, నిరాశగా, దిక్కుతోచకా, తిట్టుకుంటూ - వాళ్ళ బతుకులని, ఆ ఏజంట్లనీ - గుమిగూడి వున్న జనం తెగించి, ఆడవాళ్ళు కొందరు క్యూ కట్టారు క్యాబిన్ ప్రయాణానికి. ప్రయాణం జీవన్మరణ సమస్య.

భయంకరమైన అనుభవాలు అండమాను చరిత్ర పుటలకెక్కాయి. నేరస్తులను దూరంగా వుంచటానికి, ఆంగ్లేయులని ఎదిరించిన భారతీయులను క్రూరమైన మృగాలను బోన్లలో పెట్టినట్లు సెల్యులర్ జైలులో తోయటానికి ఉపయోగపడిన దీవి.




అలాంటిది, మెయిన్ ల్యాండును వదిలి 1200 కి.మీ. పయనించి అక్కడకు చేరి బ్రతకటానికి వెంపర్లాట.

ధైర్యంచేసి, తెగించి, బ్రతిమిలాడి కాళ్ళావేళ్ళా పడడం ద్వారా గుండెలు కరిగించి టిక్కెట్లు సంపాయించగలమన్న ఆశతో వెళ్ళిన వాళ్ళు ఆ షిప్పింగు ఏజన్సీ కార్యాలయం లోపల చొరబడగలిగితే అర్థాలు వాళ్ళకు కూడా తెలియని బూతులకు ఎరై వస్తున్నారు. అవమానాల పాలైనామన్న ముఖాలతోగాక, నిరాశతో కృంగిపోయి వస్తున్నారు.

ఈ కుర్రాడూ వెళ్ళి అక్షింతలు వేయించుకుని వచ్చాడు. లోపల వ్యక్తులు తన్నబొయ్యారట కూడా. లోపల వున్న ఒక భయంకరమైన మృగం గురించి చెప్పకొనటం వినబడింది. దానికి మనిషి రూపం వుంది. తిట్ల యంత్రంలాంటి ఆ "ఆడంగిలా జుత్తు పెంచినోడు" తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టి, దణ్ణంపెట్టి "నా ఆరోగ్యం బాలేదు, మీకు సమాధానం చెప్పి చెప్పి నా గుండెలో నొప్పిగా వుంది, వాదించి నన్ను చంపక" అంటున్నాడట – ఆ వ్యవహారంలో తిట్లు తిన్నవాడుగాక, తిట్టినవాడే బాధితుడన్నట్లు.

మెరీనర్స్ క్లబ్బులో జనం వున్నారు. వాళ్ళు మెరీనర్స్ కాదు; అది ప్రస్తుతం క్లబ్బూ కాదు. అది ఒక చారిత్రిక శిథిలం, ఒక గత జీవిత జ్ఞాపకం. ఆ శిథిలం, ఆ జ్ఞాపకం ఉపయోగపడుతోంది అండమాను గురించి ఆరులు చాస్తున్న వాళ్ళకు. వారం రోజులుగా వాళ్ళంతా అక్కడే మకాం. అది ఒక రేకుల షెడ్డు. అది చాలక ఆరుబయట గడుపుతున్నారు. చంటిపిల్లలు – మట్టిబిడ్డల్లా, బెడ్డల్లా – నేల తల్లి వడిలో. ఆడాళ్ళు – భయభయంగా, ఆత్రుతగా, చచ్చీచావనీ, బతికీ బతకని ఆశలతో. పేదరికం కాళ్ళొచ్చి, ఒళ్ళొచ్చి కదులుతున్నట్లు మెదులుతున్నట్లుంది అక్కడంతా. ప్రపంచ పేదరికపు ప్రతినిధుల్లా వున్నారంతా.

షిప్ మాస్ట్‌లు కనిపిస్తున్నాయి ఇక్కడికి. ఎత్తు ప్రహరీ గోడ అవతల షెడ్లు. ఇక్కడి వాళ్ళకు బహుశా ఆ నౌకలు అందని, అపురూపమైన అందలాలు. అందులో ఒకటి తలాయింత చోటు గురించి "ప్రయత్నాలు" చేస్తున్న పోర్టుబ్లెయర్ నౌక. ఇదే సమయమన్నట్లు కాస్తంత దూరంలో ఆగివున్న టూరిస్టు బస్సులు. డాక్ లేబర్ తీవ్రంగా చర్చించుకుంటూ హడావుడిగా వెళుతున్నారు. అండమాను వెళ్ళేవాళ్ళలా వీళ్ళూ శారీరక శ్రమే పడతారు. అయితే వాళ్ళంత ఎక్కువ కాదు. వీళ్ళు పడిన దానికి ప్రతిఫలం వేలాది రూపాయల్లో వుంటుంది. ఎక్కువ మంది ఆదాయపు పన్నులు కడుతుంటారంటే వాళ్ళ ఆదాయమెంతో ఊహించుకోవచ్చు. ఇళ్ళూ వాకిళ్ళూ వదిలి సముద్రయానాలు చేసి ఒళ్ళు హూనం చేసుకుని ఆర్జించేది సరైన ప్రతి



ఫలం కాదు. ఒకే ఘర్మజలానికి రెండు రకాల విలువలు. మా గురించి చెప్పకుండా దాటేయడమంటే ఒక నిజాన్ని దాచిపెట్టటం అవుతుంది. ఆ నిజం –

శారీరకంగా గాని, మానసికంగాగాని సౌఖ్యవంతమయిన జీవితాన్ని గడపటానికి అవసరమైనంత గడిస్తున్నాం – ఒక ప్రభుత్వ సంస్థ అనే వృక్షం ఛాయన, దానికి ఎలాంటి నిజమైన సేవ చేయకుండానే. మా సోదర సహోద్యోగులు ఆర్జించిన దాన్ని ఖర్చుపెట్టేంది పెట్టగా మిగిలిన దానితో పోటాపోటీగా, మనికట్టు దగ్గర నించి మోచేతి దాకా వున్న దూరాన్ని బంగారు గాజుల పరంపరతో అలంకరిస్తారు. (ఆ స్థానంపై వున్న మోజు వల్ల కాదు, ఆ స్థానం విలువైనదీ గాదు – దానికన్నా ఆ అలంకరణ వస్తువులే వాళ్ళకు ప్రీతిపాత్రమైనవి. మరో ముక్కలో చెప్పాలంటే

హృదయం లేకపోవడంలో వాడికీ, ఆ డంపరుకీ తేడా లేదు. వాడిని దురాశ, దుర్మార్గం నడిపిస్తూంటే... దాన్ని జాగ్రత్త లేని మనిషి నడిపాడు.

ఆ పాదార్థిక, యాంత్రిక వాతావరణంలో నేనూ ఒక యంత్రంలా కార్యాలయం వేపు వెళ్తున్నా...!

వాళ్ళను వాళ్ళు ప్రేమించిందానికన్నా ఆ పసుపు రంగు లోహాన్ని ఎక్కువగా ప్రేమిస్తారు). నెలనెలా క్రమం తప్పక కొనే వాళ్ళ ఒక్క చీర డబ్బుతో ఒక కుటుంబం నెలపాటు బ్రతకొచ్చు. మా మగ ఉద్యోగస్తులలో క్రూరమైనవాళ్ళూ, ఓర్పులేనివాళ్ళూ, అలాంటి చెయ్యి ఒక్కటి నరుక్కొచ్చుకుంటే శేష జీవితం దిగుల్లేకుండా గడిపెయ్యొచ్చని "హాస్యం" పోతారు. దేశం మాకు రుణపడి వుంది. రుణాలు న్యాయానికి తీర్చాల్సినవే గదా. ఈ విధంగా బాకీ వసూళ్ళు చేసుకుంటున్నాం.

"పోనీ నేనెళ్ళి ప్రయత్నం చేయనా" అన్నా ఆత్మ విశ్వాసం తొణికిసలాడుతూ. వాడి కళ్ళలో ఆశ వెలుగు. నా సహోధ్యాయులను శనక్కాయలు తింటూ అక్కడే వుండమన్నా. వాడు వాడి కాయలను పదిలంగా పట్టుకుని వున్నాడు తినే ప్రయత్నం చెయ్యకుండా.

ఆ షిప్పింగ్ ఏజన్సీ మా ప్రభుత్వ సంస్థ మీద ఆధారపడి బతుకుతుంది. వాళ్ళకు అనుమతులు, లైసెన్సులు వగైరాలు మేమే ఇవ్వాలి. మెట్లెక్కి వెళ్ళాను. హాల్లోకి అడుగుపెట్టనీయకుండా సైంధవుడితో ఏదో బంధుత్వం వున్నవాడు అటకాయించాడు. నేనెవరో చెప్పంగానే విసుక్కుంటూ అడ్డు తొలిగాడు. హాలు నిండా టేబుళ్ళు, కుర్చీలు, అతిథులు కూర్చోడానికి టేబుళ్ళకు అటుపక్క కుర్చీలు వున్నాయి. ఒక యంత్రం ముందు కూర్చుని ఎవరో అత్యాచారం చేసినట్లు మొహం పెట్టుకుని లెక్కలేస్తున్నాడు ఆ వ్యక్తి. వాడికెదురు కుర్చీ లాక్కుని కూర్చున్నా. కన్నెత్తి కూడా చూడలేదు వాడు.

"ఈ అండమాన్ టిక్కెట్లూ..." గొంతు సవరిం



ముకుని అంటూ మధ్యలో ఆగిపొయ్యా. అండమాన్ అంటే వాడ్ని ఏదో బూతుమాటతో తిట్టినట్లుగా ప్రతిస్పందించాడు. కోరలు బయటపెట్టాడు. అండమాన్ని నానా శాపనార్థాలు పెట్టాడు.

"ఒక్క టిక్కెట్టు చాలండి. ఎక్కువక్కర్లేదు. తెల్పినవాళ్లెడదామనుకుంటున్నారు"

"అర టిక్కెట్టు కూడా లేదు" అన్నాడు మొరటుగా.

"మరీ అంత నిర్మొహమ్మాటంగా మాట్లాడకండి."

"కాకపోతే? మీ కివ్వాల్సిన ముదుపులు ఆదుగడుగున సమర్పించుకుంటున్నాంగా. లేని అండమాను టిక్కెట్టు సృష్టించి, మీకు ఆ ముదుపులకు వడ్డీగా సమర్పించుకోవాలా?"

"నా కెప్పడన్నా ముదుపిచ్చారా మీరు?"

"మీకు కాకపోతే మీ సోదరులకి."

"మరీ నీతి కబుర్లు చెప్పకండి. న్యాయంగా, ధర్మంగా నడుస్తోందా మీ షిప్పింగ్ కంపెనీ."

"మీ పరిమితులు దాటి మాట్లాడకండి."

"వందమంది కిచ్చారో లేదో టిక్కెట్లన్నీ మాయమయిపొయ్యాయా?"

"గెటౌట్"

వీరశైవం పూనినట్లు ఊగిపోతున్నాడు. "ఆడంగి జుత్తోడు". శిఖండిలా, మొండిలా తోచాడు. హృదయం లేని రాబోట్‌లా తోచాడు. వాడు రాబోట్ కాదు మనిషే అని ఎవరన్నా వాదించదలచుకుంటే వాడిలోని క్రౌర్యం, దుర్మార్గం, అవమానించటం లాంటి మనిషికి మాత్రమే ప్రత్యేకమయిన గుణాలను ఉటంకించి అవతలి వాడ్ని ఒప్పించవచ్చు.

యంత్రాలు నరభక్షణకు దిగితే ఎలా వుంటుంది?

తిరిగొచ్చేసరికి మావాళ్ళు శనక్కాయలు తినటం అయిపోయింది. వాడు తినటం ఆరంభం కాలేదు. రాత్రి భోజనానికి బదులుగా వాటిని దాచుకుంటున్నాడా? సహోద్యోగులు చుట్టుముట్టారు. పెదవి విరిచాను. వివరాలు చెబితేగాని వాళ్ళ ఆసక్తి తీరదు. చెప్పేను.

చెవులు బద్దలు చేస్తూ, ఎదుటి మనిషి కనబడనంతగా దుమ్మూ ధూళీ లేపుతూ వెళుతున్నాయి డంపర్లు. రంగుపోయిన ట్రంకుపెట్టె మీద కూర్చుని, క్లబ్బు ఆవరణలో చీమిడి ముక్కు పిల్ల చేతులు నాక్కుంటోంది. ఇద్దరు ముగ్గురు స్త్రీలు క్లబ్బు వెనుకకు వెళ్ళి పని ముగించి చీరలు సవరించుకుని వస్తున్నారు. ముసలాళ్ళు గొంతు కూర్చుని భయభయంగా మాట్లాడుకుంటున్నారు. మా చుట్టూ స్టాక్‌యార్డులు. నౌకల్లో తరలించాల్సిన వాటితో, నౌకల నించి దిగినవి స్టాక్‌యార్డుల నిండా పరుచుకుని వున్నాయి. ఏ సైడింగు నుంచో నిండిన వ్యాగన్లతో వెళుతూ రంకెలేస్తున్న డీజెలింజన్. సమాధానంగా హార్బరులో నించి కేకలేసేటగ్గు – వీలాగే నేనూ బరువు లాగుతున్నా, గొప్పలు పోకు అంటు. దారిద్ర్యం, సంపన్నం, దుమ్ము, ధూళి, అన్ని కాలరవాలు అన్యోన్యంగా కలిసివున్న వాతావరణం.

వాడికి మొండి చెయ్యి చూపించి కార్యాలయానికెళ్ళిపోయా.

మరుసటి రోజు, యథావిధిగా భోజనం కావించి ఎండను వెన్నెలగా భావించుకుంటూ నిన్నటి చోటుకే వచ్చాం. నిన్నటి జనమే. అదే ఆందోళన వాళ్ళలో – మార్పల్లా మరో రోజులోకి అడుగు పెట్టడం. ఒకచోట జనం గుమిగూడి వున్నారు. టిక్కెట్లు ఇస్తున్నారా, పంచుకుంటున్నారా? డంపరు ఆగి వుంది వాళ్ళ మధ్య. ఏదో జరిగింది.

"ఏమిటి?" – ఎవరో కుర్రాడు చచ్చిపోయాడు.

"వయసూ?" – పదిహేను, పదహారుండొచ్చు.

చొక్కా పై జేబులో అండమాను టిక్కెట్టుందట. శనక్కాయలు నా చేతి మీదుగా కొనుక్కున్న నిన్నటి కుర్రాడు గుర్తుకొచ్చాడు. వాడేనని ఎందు కనుకుంటున్నా? నాకు నేను దోషిలా తోచాను ఆ భావన కలిగినందుకు. కథలాంటి ఈ జీవితానుభవానికి అలాంటి ముగింపు, మలుపు పరిపూర్ణత నిస్తాయా? ఒక కథకు మలుపు కావాలని అలా అయి వుంటుందనుకోటం ఘాతుకం. వాడు కాకపోవచ్చు, మరొక కుర్రాడు కావచ్చు. వాడూ దారిద్ర్యపు బాధ నుండి తప్పించుకునే ప్రయత్నంగా అండమాను వెళ్ళదలచుకున్నవాడే. వాడైనా, మరొకడయినా ఒకటే. లోపలికెళ్ళి ఒకసారి చూద్దామనిపించింది. ఎందుకు చూడ్డం? "వాడు" అవునా కాదా అన్న సందేహ నివృత్తి కోసం! ఎందుకు ఆ సందేహం తీర్చుకోవాలి? ఏమో! అది ఒక మానసిక దురద. ప్రతి శారీరక దురదలోనూ మనసు ప్రమేయం వుంటుంది. ఈ మానసిక దురదలో శరీరానికి పాత్రలేదు.

ఆ సందేహం తీరకూడదు. నిర్హేతుకమైన వ్యవస్థలో వేయి ప్రతికూల పరిస్థితులలో, ఏదో రాజ్యం గురించో అపాయం గురించో కాక, ప్రాణాలు నిలమెట్టుకోవడానికి – అవే ప్రాణాలొడ్డి – జీవన పోరాటం సలుపుతూ వస్తున్న, నాకు పరిచయమైన ఈ బాలచంద్రుడు మరణించకూడదు – కారణాలేమైనా కానీయండి. నాలోని వాడి జ్ఞాపకానికి ముగింపు వాడి చావు కాకూడదు.

ఆ ప్రమాదం గురించిన వివరాలు తెలిసిపోతాయేమోనని – ఎలాంటిదీ నేను వినదలచుకోలేదు – మావాళ్ళని వదిలేసి ఒక్కడినే తిరిగి వస్తున్నా. ఆ శనక్కాయల బండి అక్కడే, ఎప్పటి చోటే వుంది. బాలచంద్రుడు మాత్రం లేడు. బహుశా, ఇపుడప్పడే శనక్కాయలు నాకు రుచించవు. భవిష్యత్తులో రుచించినా ఈ జ్ఞాపకాన్ని రేపక మానవు.

ఎవరో తరుముకొస్తున్నట్లు భుజం మీదినించి తల తిప్పి చూస్తే (రక్తం మడుగులో?) ఆగివున్న డంపరు పైభాగం కనిపిస్తోంది. తరుముకు రావడం లేదు. చూడటానికి క్రూరంగా లేదు; హింసించి చిత్రవధ చేసే తత్వమూ దానిలో కనిపించలేదు; అది చేసింది హత్య కాదు – ప్రాణం లేనిది గదా.

ఆడంగిరేకులోడి మొహం గుర్తుకొచ్చింది; క్రూరమైనది – వాడికి ప్రాణముంది గదా. వాడు చేసేవి "హత్యలు" కాదు! (వాడు సాటి (?) మనుషులను పెట్టేవి?)

హృదయం లేకపోవడంలో వాడికి, ఆ డంపరుకు తేడా లేదు. వీడిని దురాశ, దుర్మార్గం ఆడిస్తున్నాయి. దాన్ని జాగ్రత్తలేని మనిషి నడిపాడు.

ఆ పాదార్థిక, యాంత్రిక వాతావరణంలో, నేనూ ఒక యంత్రంలా కార్యాలయం వేపు వెళుతున్నా...